# పండుటాకులు

వృద్ధాశ్రమంలోకి అడుగు పెట్టాడు భార్గవ. జగిత్యాలకు దూరంగా ధర్మపురి రోడ్డులో ఉందా ఆశ్రమం.

గతంలో ఆ వృద్ధాశ్రమం పేరు విన్నాడు. కానీ చూడ్డం ఇదే తొలిసారి.

ఎందుకో తెలీదు! సడెన్‌గా వృద్ధాశ్రమానికి వెళ్ళాలన్పించింది. పరుగెత్తు కొచ్చాడు.

ముందుగా ఆ ఆశ్రమ కేర్‌టేకర్‌ని కలిసాడు. అక్కడి వాళ్ళతో కాసేపు గడపాలన్న తన ఆకాంక్షని వ్యక్తపరిచి, పర్మిషన్ తీసుకొని వృద్ధుల చెంతకు వెళ్ళాడు.

సాయంత్రం వేళ కావడంతో అందరూ ఆరుబయటే ఉన్నారు. ఎవరి లోకంలో, ఎవరి ధ్యాసలో వాళ్ళున్నారు.

శోకతప్తులై అక్కడకూడా ఒంటరిగా కొందరు, హృదయభారాన్ని పంచుకుంటూ, తమ అనుభవాల్ని ఇతరుల ముందు నెమరువేసుకుంటూ గుంపులుగా చేరి మరికొందరు. అందరూ ఉండి ఆసరా లేని అనాధవృద్ధులు వాళ్ళు,

వార్థక్యమే ఆ ఆశ్రమాన్ని నెలకొన్న భ్రాంతి. విషాద భావనకులోనై విచలుడయ్యాడు భార్గవ.

ఎవరో పండు ముదుసలి ఏడుస్తున్నాడు. ప్రక్కనున్న ఇద్దరు ముసలివాళ్ళు ఓదారుస్తున్నారు. కొత్తగా ఆ ఆశ్రమంలో చేర్చబడినట్టున్నాడు.

తన హృది వేదనంతా వాళ్ళ ముందు పరుస్తున్నాడు.

భార్గవ చప్పున ఆగిపోయాడు విందామని.

"నా కొడుక్కి చిన్నతనంలో విరోచనాలు వచ్చి చావుబతుకుల్లో ఉంటే, డబ్బుల్లేక, మరోదారి కన్పించక, నా పెళ్ళాం పుస్తెలు తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బులు డాక్టర్‌కి ఫీజిచ్చి బ్రతికించుకొన్నాను.

వాడు ప్రయోజకుడై ముసలితనంలో మమ్మల్ని ఆదరిస్తాడన్న ఆశతో బడికి పో నాన్నా అంటే- వీధుల వెంట తిరిగి చెడిపోయాడు. చదువు అబ్బలేదు. వీధిపోట్లాటలో ఒకసారి జైలుకి కూడా పోయాడు. మరోసారి తలపగిలి రక్తం కావలసివస్తే, రక్తం కొనడానికి డబ్బుల్లేక నా ఒంట్లో బలం లేకపోయినా, రక్తం పంచుకు పుట్టినవాడు కదా అని రక్తం ఇచ్చి బతికించు కున్నాను.

అలాంటి నా కొడుకు రెక్కలుడిగిన వేళ బుక్కెడు తిండిపెట్టలేక ఇంట్లోంచి తరిమేశాడు. ముసల్ది బ్రతికుంటే ఇలాంటి కొడుకుని కన్నందుకు గుండె పగిలి చచ్చేదెప్పుడో!"

చెప్పడమాపి ఏడుస్తున్నాడా వృద్ధుడు. వృద్ధాప్యం రక్తమాంసాల్నే కాదు. కన్నీళ్ళని సైతం లాగేసుకున్నట్టుంది. అతడు ఏడుస్తున్నా కన్నీళ్ళు రావడం లేదు.

బరువెక్కిన గుండెలో భార్గవ భారంగా కదిలాడక్కడినుండి.

రెండడుగులు వేశాక కన్పించిన దృశ్యం కలిచివేసిందతన్ని. విషాదానికి నిలువెత్తు సాక్ష్యంలా వుందా దృశ్యం.

ఒంటరిగా కూర్చొని రోదిస్తుందొాక వృద్ధురాలు. మోకాళ్ళ మధ్యన తలదూర్చి తనకు తానే కుమిలిపోతోంది.

అతడి అడుగులు ముందుకు పళ్ళేదు. ఆగిపోయాడక్కడే, జాలిగా చూసాడామె వంక.

ఏ జ్ఞాపకాలు తడి ఆ వయోవృద్ధురాలి గుండెపుటల్ని ఆర్తిగా తడిమిందో, ఆ వృద్ధ మనోఫలకంపై ఏ అనుబంధపుటక్షరాలు ఆవిష్కృత మయ్యాయో గానీ దీనంగా విలపిస్తోంది.

చప్పున దగ్గరగా వెళ్ళబోయాడు. 'ఏమని ఓదార్చగలను? కదిపితే కడిపెడు కన్నీళ్ళేగా!' అనుకుంటూ విరమించుకున్నాడు.

ఆమెనలాగే వదిలేసి ముందుకు వెళ్ళిపోయాడు శూన్య మనస్కుడై.

మరొక చోట మరో వృద్ధుల గుంపు కన్పించినిల్చిపోయాడక్కడ.

"పున్నామ నరకం నుండి రక్షించేవాడు కొడుకంటారు. అలాంటిది బ్రతికుండగానే పున్నామ నరకంలోకి తోసేస్తున్నారు కొడుకులు. నీ యవ్వ! పోరగాండ్లను కనుడేంది. వాళ్ళకోసం కాయకష్టం చేసుడేంది. సుఖం త్యాగం చేసుకునుడేంది. ముసలితనం వచ్చినంక గొడ్లలాగ ఇక్కడ బతుకుడేంది?" అంటున్నాడొాక ముసలాయన ఆవేశం, అసహనం, బాధ మిళితమైన గొంతుతో.

"నిజమేనయ్యా! నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళూ రైటే! నాకొక కొడుకు-

కూతురు. పెంచి పెద్దచేసి ఉన్నంతలో ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేశాను. వాళ్ళ బతుకేదో బతుకక, వాళ్ళకి పిల్లలయ్యాక కూడా ఏదోరకంగా నా మీదనే ఆధారపడ్డారు.

కొడుకు బలవంతంగా డబ్బులు గుంజుకు పోయేవాడు. వాడి సంపాదన తాగుడుకే చాలదు. సంసారం గురించి పట్టించుకోవడం మానేశాడు. వాడి పిల్లగాండ్లు ఆకలితో ఏడుస్తుంటే చూడలేక చాతకాకపోయినా ఓపిక తెచ్చుకుని రిక్షా లాగాను. రక్తం ఉడికేదాకా వాడికి, వాడి సంసారానికి సాయపడ్డాను.

అలాంటిది ఎప్పుడైతే నాపైసల్ సంపాదన ఆగిపోయిందో, నీ బతుకు నువ్వు చూసుకుపో నిన్ను పోషించడం నావల్ల కాదంటూ- ముసలివాడిననే దయలేకుండా నిర్దాక్షిణ్యంగా ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు."

వృద్ధనేత్రాలు రాలుస్తున్న కన్నీటి బిందువుల్ని పై పంచెతో తుడుచుకుంటూ తన వ్యధని వెళ్ళగక్కుకుంటున్నాడు మరొక ముసలాయన.

మనిషి జీవితపు పొరల మీద శైశవాక్షరాలను లిఖించే కాలం తదనంతరం వార్ధక్యానికి అండర్‌లైన్ చేస్తుందన్న నగ్నసత్యానికి ప్రతీకలుగా నిల్చిన వాళ్ళని జాలిగా చూస్తూ, ఆ వృద్ధులని దాటుకుంటూ ముందుకు నడిచాడు.

"బాబూ!" అనే పిలుపు వినిపించింది అస్పష్టంగా.

భార్గవ అటువైపు తలతిప్పి చూశాడు.

అక్కడొక పండు ముదుసలి కూర్చుని వుంది.

"నిన్నే బాబూ!" అంది మళ్ళీ మసకబారిన చూపుల్ని సారిస్తూ. దగ్గరగా వెళ్ళాడు. ఆమెకి ఎదురుగా మోకాళ్ళపైన కూర్చున్నాడు.

"ఏంటమ్మా?" అనడిగాడు కుతూహలంగా.

"నాకో సాయం చేసి పెడతావా?" అడిగిందామె. ఆమె కంఠం వణుకుతోంది. గాజు కళ్ళతో ఆశగా చూస్తోంది.

"తప్పకుండా, ఏంటో చెప్పు." అనడిగాడు చనువుగా.

అదిగమనించి "పర్వాలేదు చెప్పమ్మా." అన్నాడు భార్గవ నవ్వుతూ.

"ఒక్కసారి... ఒక్కసారి నన్ను అమ్మా అని పిలుస్తావా?" అలా అంటుంటే పెదవులు వణికాయి.

ఆకాశం ఫెళ్ళున విరిగి రెండుగా చీలినట్లు ఉలిక్కిపడ్డాడతను.

తేరుకుని "ఇందాక పిలిచాగా?" అన్నాడు.

"అలాకాదు. ఒక కన్నతల్లి తన పొత్తిళ్ళలోని పాపాయిని ప్రేమగా గుండెలకి హత్తుకొని... అనురాగాన్ని, వాత్సల్యాన్ని రంగరించి పాలుగా బోసి నోటికి అందిస్తున్నంత ఆప్యాయతతో... స్వచ్ఛందంగా...'అమ్మా' అని గుండెగొంతుకతో పలకాలి."

నిరాదరణ... వృద్ధాప్యాన్ని ఎంత క్షుంగదీస్తుంది? ఆప్యాయతకి మొహం వాచిన ఆ

మాతృమూర్తి "అమ్మ" అనే పలకరింపుకి అల్లల్లాడి పోతోంది.

ఆ వృద్ధురాలి మనోవేదన అర్థమై ఒక అశ్రుకణం భార్గవ గుండె గదిలో సుడులు తిరిగింది.

చలించి పోయాడతను.

అతడి మౌనం ఆ తల్లిలో సంశయాన్ని కల్గించింది.

అపనమ్మకంగా చూసిందతనివంక.

తొలిసారిగా భావోద్వేగానికి లోనవుతున్నాడతను. అతడిలో అతనికే తెలీని సరికొత్త సంఘర్షణ.

కాసేపు ఇద్దరిమధ్య స్తబ్దత.

"పోనీ ఊరికే పిలవ వద్దులే బాబూ!" అంటూ వణుకుతున్న ఆమె చర్యని నిర్లిప్తంగా గమనిస్తున్నాడు భార్గవ.

"ఇదిగో ఈ యాభైరూపాయలు తీసుకొని..." అందివ్వబోయింది. భార్గవ గుండె బ్రద్దలయ్యింది.

వృద్ధాప్యంపై సానుభూతి. ఆవృద్ధురాలిపై జాలి. అతడి మనసుని ఆర్ద్రతాభరితం చేశాయి.

అప్రయత్నంగా భార్గవ కనుకొనలు కన్నీటి కొలనులయ్యాయి.

"రెండక్షరాల ఆ మధురాక్షరాలు వెలకట్టలేనివి తల్లీ!" అని ఆర్తిగా పలుకుతూ డబ్బు అందిస్తున్న ఆమె చేయిని సున్నితంగా వెనక్కి నెట్టాడు.

"అమ్మా!" అని పిలిచాడు మమకారం నిండిన గొంతుతో.

ఆ స్వరం ఓంకార నాదమై ఆ వృద్ధురాలి చెవిని సోకిందేమో-

వర్షపు చినుకు స్పర్శకి పులకరించిన నేలతల్లిలా పరవశించిపోయిందా పిలుపుకి.

"ఏదీ మరొక్కసారి..." అర్థించిది, అభ్యర్థించింది, దీనంగా, ప్రేమగా. ఆ వృద్ధ నేత్రాల్లో నీటితడి.

"అమ్మా! అమ్మా...!" అలా పిలుస్తూనే ఉన్నాడు భార్గవ తనను తాను మైమరచి. కన్నతల్లిని పిలుస్తున్నంత కమ్మగా.

"భార్గవా! నాన్నా భార్గవా! ఏంట్రా కలవరిస్తున్నావ్?"

అంటోన్న తల్లి పలకరింపుకి నిదురచెదిరింది. కళ్ళు తెరిచాడు భార్గవ.

పక్కన కూర్చున్న తల్లి అనసూయమ్మ ప్రేమగా కొడుకు తల నిమురుతోంది. ఆ కన్నతల్లి స్పర్శ భార్గవని కన్నీళ్ళ పర్యంతం చేసింది.

"ఏంటి నాన్నా! ఏంటా కన్నీళ్ళు!" అడుగుతోంది కన్నతల్లి.

దిగ్గున లేచి కూచున్నాడు.

చిన్నతనంలో మలేరియా సోకి... నిద్రరాక రాత్రిళ్ళు పలవరిస్తుంటే... తెల్లవార్లూ తన చెంతనే ఉండి... గుండెకి హత్తుకుంటూ...విరామమెరుగక సేవ చేస్తూ... కంటికి రెప్పలా కాచుక్కూర్చున్నది ఆనాటి అమ్మే!

తల్లి ప్రేమలో భేదం లేదు.

మరి తనలోనే ఎందుకు మార్పు?

భార్గవ మనసు ఘోషిస్తోంది.

చప్పున కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

"ఇంతకీ మాధురీ ఏదమ్మా?" తన భార్య గురించి అడిగాడు.

"కోడలు పిల్ల వంటింట్లో ఏదో పనిలో ఉంటుందిరా వినపడనట్టుంది. అమ్మా, అమ్మా... అని నిద్రలో అరుస్తే పరుగెత్తుకు వచ్చాను." సర్ది చెప్పింది.

నిర్లిప్తంగా నవ్వుకున్నాడు.

"అదిసరే! పగటి నిద్ర. పీడకలలేమైనా వచ్చిందా?" ఆత్రంగా అడుగుతోంది అనసూయమ్మ కొడుకుని అప్యాయంగా చూస్తూ.

క్షణకాలం మౌనం వహించాడు.

"పీడకల కాదమ్మా... దుష్టాలోచన వచ్చింది." అన్నాడు చప్పున.

ఆశ్చర్యంగా చూసింది కొడుకు వంక. అతని ముఖంలో మారుతున్న రంగులు ఆమెకి కొత్తేంకాదు. ఇప్పటి మాటలే వింతగా తోస్తున్నాయి.

కన్నకొడుకంటే పిచ్చి ప్రేమ అనసూయమ్మకి. ఒక్కగానొక్క కొడుకైనందుకో, చిన్నతనంలోనే తండ్రిలేని పిల్లవాడైనందుకో మరి అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిందతన్ని.

"అమ్మా! నన్ను...నన్ను క్షమిస్తావా?" చప్పున అడిగాడు తల్లి వంక బేలగా చూస్తూ.

"ఛ! అవేం మాటలు? తల్లి కన్నబిడ్డను క్షమించడమేంట్రా?"

"అది కాదమ్మా! నేనొకటి అడుగుతాను చెప్పు."

తలూపింది.

"వృక్షం పండుటాకుల్ని బలవంతంగా వదల్చుకోవచ్చా?"

కాసేపు నిశ్శబ్దం. భార్గవని అనుమానంగా చూసింది. అదీ క్షణకాలమే!

"ఏంటీ కొత్తగా మాట్లాడ్తున్నావ్?" ప్రశ్నించింది.

కొడుకు వాలకం అర్థంకావడంలేదు.

"ముందు నేనడిగిన దానికి సమాధాన మివ్వు."

"కూడదు. పండుటాకులు గాలివేటుకి సహజంగా నేల రాలిపోవాలి." అంది.

"కానీ నేను నిన్ను నిర్దాక్షిణ్యంగా వృద్ధాశ్రమంలో చేర్పించాలను కున్నానమ్మా! నన్ను

మన్నించమ్మా!" దోసిట్లో ముఖం దాచుకున్నాడు భార్గవ.

అదివిని ఆ తల్లి ఒక్క క్షణం నివ్వెరపోయింది.

"ఈ చెడుతలంపు నీ కోడలిదే అయినా వంతపాడడం నా దౌర్భాగ్య మమ్మా!"

మనసులోని మాలిన్యాన్ని కన్నీటి రూపంలో వెళ్ళగక్కుకుంటున్నాడు.

"కొమ్మకి వృక్షం ఆధారం. వృక్షానికి కొమ్మ ఆలంబన. కొమ్మకి చిగురాకులే శోభ. వృక్షం నీవైతే, నీ భార్య కొమ్మ. నీ పిల్లలు చిగురాకులు. నేను పండుటాకునే కదా బాబూ! కొమ్మ చిగురాకుల వసంతాన్ని కోరుతుంది. కానీ పండుటాకుల శిశిరాన్ని కాదుగా. అది సహజం." అంది అనసూయమ్మ.

ఇంత జరిగినా తల్లి తమని తప్పుపట్టక పోవడం, భార్గవని మరింత కుంచించుకు పోయేలా చేసింది.

"నీకెలా తోస్తే అలా చెయ్యిబాబూ! నీవు పసివాడిగా ఉన్నప్పుడు నువ్వడిగిందే చేశాను. కోరిందే ఇచ్చాను. ఇప్పుడూ అంతే. నా సాన్నిత్యం మీకు ఇబ్బందిగా తోస్తే... నా పోషణ మీకు భారమై నిలిస్తే... అలాగే కానివ్వు. తక్షణం ఇక్కడినుండి వెళ్ళిపోతాను. నాక్కావాల్సింది నీవూ, నీ కుటుంబం సంతోషంగా ఉండడం."

ఆమె మాటల్లో కించిత్ కటువులేదు. కొడుకన్న మమకారం, వాత్సల్యం తప్ప.

తల్లి మంచితనాన్ని భరించలేకపోయాడు భార్గవ.

గుండె పగిలి కన్నీరై ఒలుకుతుంటే-

తల్లి పాదాల ముందు శిరసువంచి మోకరిల్లాడు. పశ్చాత్తాపం చెందిన పసివాడిలా.

"మమకారాన్ని మునుపటిలా మనసులోకి ఒంపుకొని, గుండె గదుల నిండా ఆత్మీయత నింపుకొని, అనునిత్యం ఆదరణ కురిపించే కొడుగ్గా నన్ను నేను మలచుకుంటానమ్మా. నీ వృద్ధాప్యాన్ని మసిబారనీయనమ్మా! నిన్ను అనాథతల్లిని చేయనమ్మా." అంటూ కన్నీటితో ఆ మాతృమూర్తి పాదాలు కడుగుతున్నాడతను.

అనసూయమ్మ చూపులు ఎప్పటిలా కరుణనే వెదజల్లుతున్నాయి.

కథా నిలయం
6057
శ్రీకాకుళం